# నేను తాతనయ్యానోచ్!

సాయంత్రం నాలుగు గంటలు. ఆఫీసులో ఓ ముఖ్యమైన సమావేశంలో వున్నాను. మొబైల్ మోగింది. చూస్తే ఇంటి నుంచి. వెంటనే కట్ చేసి మీటింగ్‌లో మునిగిపోయాను.

మీటింగ్ ముగిసేసరికి అయిదు గంటలు. నా సీట్లోకొచ్చి ఇంటికి ఫోన్ చేశాను.

"అక్కకు అబ్బాయి పుట్టాడు నాన్నా. మీరేమో ఫోన్ కట్ చేశారు. మళ్ళీ మీరు ఫోన్ చేస్తారేమోనని చూసి, చూసి అమ్మ ఇప్పుడే హాస్పిటల్‌కు వెళ్ళింది" మా అబ్బాయి చెప్పాడు.

అంటే నేను, నేను, తాతనయ్యాను !

ఆ తలపే మనసును పులకింపజేసింది.

"సరే నేను నేరుగా హాస్పిటల్‌కు వెళతాను" ఫోన్ పెట్టాను.

స్నేహ! నా నోటి నుంచి ఊడిపడ్డ రత్నం (మా అమ్మాయిది నా పోలికే) నా కళ్ళముందే పెరిగి పెద్దయిన మొక్క! అప్పుడే అమ్మయింది! నలభై అయిదేళ్ళకు నన్ను తాతను చేసింది. నా మనసు మనసులో లేదు. ఎప్పుడు నా మనవణ్ణి చూస్తానా అనే ఆతృత. వెంటనే ప్యాకప్ చేసి హాస్పిటల్‌కు బయలుదేరాను.

హాస్పిటల్లో!

స్నేహ పొత్తిళ్ళలో బాబు! నా మనువడు ! అలా చూస్తూనే వున్నాను.

"బావా! ఇక్కడ మేము కూడా ఉన్నాము. ఓ కన్ను ఇక్కడ కూడా పారేయండి. ఎంతసేపలా చూస్తారు? మీ మనవడే. మీ పోలికే!"

మా మరదలి మాటలతో ఈ లోకంలోకి వచ్చాను.

"వాడికి మనవడు కాని, నీకు మాత్రం కొడుకు కాడా ఏమిటి ? నువ్వు గంటల తరబడి చూడగా లేనిది, మావాడు కొన్ని సెకండ్లు చూసినంతమాత్రాన దిష్టితగలదులే" మా అమ్మ చురక అంటించింది.

అది స్పెషల్ రూం. మా వియ్యపురాలు, వాళ్ల తాలూకు బంధువులు, మా తాలూకు బంధువులు, వీరందరితో స్పెషల్ రూం కోలాహలంగా వుంది.

పసివాడ్ని కొందరు అమ్మాయి పోలికంటే, కొందరు మా అల్లుడి పోలికన్నారు. మా మరదలి లాంటి కొందరు, నా పోలికన్నారు. ఇలా ఎవరి తాలూకు వాళ్ళు వాళ్ళవాళ్ళ పోలికలను ఆ పసివానిలో చూసుకున్నారు. నాకైతే మా అమ్మాయి స్నేహ, అల్లుడు కిరీటిల పోలికలు కనిపించాయి. కళ్ళు స్నేహవయితే, ముక్కు కిరీటిది. నోరు మాత్రం నాలా వెడల్పుగా వుంది.

నా పిచ్చిగానీ, పుట్టగానే పోలికలు కనిపెట్టగలమా? బాబు పెరుగుతున్నకొద్దీ ముఖ కవళికల్లో మార్పులు వస్తాయి. తల షేపు కూడా మారుతుంది. మూణ్నెల్లకి గాని స్పష్ట ముఖకవళికలు ఏర్పడవని ఎక్కడో చదివినట్లు జ్ఞాపకం.

స్నేహ ముఖంలో ఓ వింతకాంతి. ఓ నిండుదనం. మందహాసంతో అందరి అభినందనలు అందుకుంటోంది. తన బాబును అపురూపంగా చూసుకుంటోంది. లాలనగా పాలు పడుతోంది. స్నేహ పుట్టినప్పుడు, శ్రీమతి ముఖ కవళికలు, హావభావాలు జ్ఞప్తికి వచ్చాయి. దాదాపు అదే ఆనందం. కళ్ళలో అదే తృప్తి. అందుకేనేమో ఆడవారికి మాతృత్వం ఓ వరమంటారు. పాప బోసినవ్వులో తాము పడ్డ ప్రసవ వేదన మరచిపోతారు వారు.

"ఓ బావగారూ! మళ్ళీ మీ కలల్లోకి వెళ్ళిపోయారా ? లేక కథకి ప్లాటు గురించి ఆలోచిస్తున్నారా ? మీరు కాస్త బయటికి వెళితే నర్సులు వాళ్ళ డ్యూటీ చేస్తారట."

"ఓ సారీ!" అని, కళ్ళతోనే స్నేహకి వీడ్కోలు చెప్పాను.

అయిదవ రోజు స్నేహని, బాబుని హాస్పిటల్ నుంచి తీసుకొచ్చాం. ఇరుగుపొరుగు వారితో, వచ్చి పోయే బంధువులతో ఇల్లంతా సందడే సందడి. మళ్ళీ పోలికల చర్చ,

కొందరు ముద్దుగా ఉన్నాడని మురిసిపోతే, కొందరు బొద్దుగా వున్నాడని ముద్దాడడం. శ్రీమతి రోజూ పొద్దున, రాత్రి క్రమం తప్పకుండా దిష్టితీయడం, మొత్తంమీద మా ఇంట్లోకి కొత్త జీవం వచ్చింది.

మా ప్రాధాన్యాలు మారిపోయాయి. శని, ఆదివారాలు సెలవైనా ఆఫీసుకు చెక్కేసే నేను, ఆఫీసు నుంచి తొందరగా వస్తున్నాను. సెలవు రోజుల్లో ఇంట్లో మనవడే లోకంగా ఉంటున్నాను. నా స్ట్రెస్ ఎటుపోయిందో? పసివాడి కేరింతలతో మనసుకు హాయిగా వుంది.

విద్యకైతే ఇక క్షణం తీరికలేదు. అమ్మాయి, మనవడి చుట్టే రోజంతా గడుపుతోంది. నన్ను దాదాపు మరిచిపోయింది. ఏదైనా వస్తువు దొరక్క అడిగితే... "మీ స్టడీ టేబుల్ మీదో, బీరువాలోనో, టేబుల్ సొరుగులోనో ఉంటాయి. ఆమాత్రం తీసుకోలేరూ? చూస్తున్నారు కదా ఎంత బిజీగా ఉన్నానో? బాబుకి మాలిష్ చేయాలి, పక్కబట్టలు మార్చాలి, ఒకటికి, రెండుకి పోతే కడగాలి. ఒంటి బట్టలు మార్చాలి. పసిపిల్లవాడన్నాక ఎన్ని చేయాలి. అమ్మాయికి మొదటి కానుపాయె. ఈ పనులన్నీ ఎలా కుదురుతాయి చెప్పండి?" విద్య దండకం మొదలెడుతుంది.

"తప్పయింది బాబూ, నీకూ నీ మనవడికో దండం. నా పనులు నీకిక చెప్పనులే. ఇక నీ క్లాసు కట్టిపెట్టు" నాలో ఉక్రోషం. అదీ తాత్కాలికమే. నా మనవణ్ణి చూసే సరికి, కోపమంతా మటుమాయం. ఆఫీసులో పని ఒత్తిడి బాగా ఉంది, డెడ్‌లైన్లు ఉన్నాయి, ప్రాజెక్టు పూర్తి చేయాలి - అని నెలల తరబడి బెంగుళూరు నుంచి ఇంటికి రాకుండా వుండే కిరీటి ఏకంగా మూడువారాలు సెలవుపెట్టి వచ్చాడు. అమెరికాకు చెందిన ఒక మల్టీనేషనల్ ఐ.టి. కంపెనీలో కిరీటి టీమ్‌లీడర్. వాళ్ళ ఆఫీసు మేమున్నచోట లేనందున ఏ మూడు నెలలకొకసారో బెంగుళూరు నుంచి వస్తాడు. సంవత్సరానికి కొన్ని 'ల'కారాలు జీతంగా తీసుకునే కిరీటి, పసివాని సాన్నిహిత్యంలో చిన్నపిల్ల వానిలా మారడం, నాకు, విద్యకి ఆశ్చర్యంగా వుంది.

మా స్నేహ పుట్టినప్పుడు, నేను మా అల్లునిలా స్పందించలేదు. ఏదో రెండురోజులు సెలవుపెట్టి అత్తవారింటికి వెళ్ళాను. విద్యని పలకరించి, పాపని దూరం నుంచే చూశాను. ఇంతలా పగలూ, రాత్రీ పాపే లోకంలా ఉండలేదు. మూణ్నెల్లలో మా ఇంటికి వచ్చిన తర్వాత కూడా అప్పుడప్పుడు ముద్దాడేవాణ్ణి, కాస్త లాలించేవాణ్ణి. కాని ఇలా గంటల తరబడి పాపతో ఆడుకోలేదు. అప్పటి నా ప్రాధాన్యం నా కెరీర్. జీవితంలో పైకి రావాలనే ఆరాటం. ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే తపన. మా

అమ్మాయి, అల్లుడు, మనవడు, వాళ్ళలోవాళ్ళు ఆడుకుంటుంటే అపురూపంగా ఉంది. ఆఫీసు పనిలో పడి నేను ఏ అనుభూతిని కోల్పోయానో కొట్టొచ్చినట్టు అగుపడుతోంది. గంటలకు గంటలు కంప్యూటరుతో కుస్తీపట్టే ఇంజనీర్లకి మామూలు అనుభూతులూ, అనురాగాలూ, ఆప్యాయతలు వుండవనుకునే నా అభిప్రాయాన్ని, మా పిల్లలను చూసి మార్చుకున్నాను.

"బుజ్జీ! నువ్వు పుట్టినప్పుడు నాన్న ఇక్కడెందుకు లేడో అడుగు" అమ్మాయి.

"హాయ్ బుజ్జీ. నువ్వు వారం రోజుల ముందు వస్తావని నాకేం తెల్సు? నీరాక తేదీకి రెండురోజులు ముందునుంచే సెలవు శాంక్షను చేయించుకున్నాను. ఆ ప్రకారమే వచ్చాను. నువ్వు తొందరపడితే తప్పునాదా? అయినా నేను రాగానే నువ్వు నవ్వావు. మీ అమ్మేమో మూతి ముడుచుకుంది. నీకున్న కామన్‌సెన్స్, మీ అమ్మకు లేదు. ఈమెయిల్‌లో నీ ఫోటో పంపకపోగా నేను వచ్చినతర్వాత కూడా ఓ రెండు గంటలు మాట్లాడలేదు. అది తప్పుని మీ అమ్మకి చెప్పు" – అల్లుడు.

"ఒంటికి పోయావా? బట్టలు మార్చమని ఏడుస్తున్నావా? మా బుజ్జిగాడికి ఎంత తెలివో?" – స్నేహ.

"నువ్వు 'నా' బాబువి కదా? అందులో ఆశ్చర్యమేముంది?" – కిరీటి.

"ఇప్పుడే పాలుపట్టాను కదా, మళ్ళీ ఎందుకేడుస్తున్నావు? చీమకుట్టిందా ? దోమ కుట్టిందా? అవేమీ రాకుండా దోమతెర కట్టాకద నాన్నా?"

"దోమతెర కట్టగానే సరా? బట్టల్లో చీమలు వున్నాయేమో చూడమని మీ అమ్మకు చెప్పు."

పసివాణ్ణి మధ్యవర్తిగా చేసి, ఒకరికొకరు పరోక్షంగా చెణుకులు విసురుకుంటుంటే మనసుకు ఉల్లాసంగా ఉంది.

"తాత ఆఫీసుకు వెళుతున్నాడు టాటా చెప్పు, తాతా టాటా, తాతా టాటా! ఇదిగో చూడు నాన్నా నీకు 'నా' కొడుకు టాటా చెబుతున్నాడు."

ఇలా మా అమ్మాయి మాటలు వింటుంటే నా ఒళ్ళు పులకించింది.

'నా చేతుల్లో పెరిగిన చిట్టితల్లేనా ఈ స్నేహ? హోంవర్కు చేయలేదని, టీచరు కొడుతుందని స్కూలుకి పోనని మారాం చేసిన బుజ్జిపాపేనా ఈ స్నేహ? మాతృత్వం ఒక్కసారిగా ఎంత పెద్దదాన్ని చేసింది?" నాలో ఎన్నో భావాలు. ఇక మా అల్లుని మాటలు వింటే, అతను మా మనవనిలో మమేకమవడం చూస్తుంటే మాతృత్వంలోనే కాదు, పితృత్వంలో కూడా ఎంత మధురిమ వుందో ప్రస్ఫుటమయింది.

ఆనవాయితీ ప్రకారం, బాబు పుట్టిన ఇరవై ఒకటోరోజు బారసాల చేయాలని నిర్ణయించాం. పేరు మాత్రం మేమే సెలక్ట్ చేస్తామని స్నేహ, కిరీటి అన్నారు. సరే అని మేము ఇతర సన్నాహాల్లో పడ్డాము.

పురోహితుడిచ్చిన జన్మాక్షరాల ఆధారంగా పేర్ల వేట మొదలైంది. ఇంటర్నెట్‌లో ఎన్ని సైట్‌లు బ్రౌజ్ చేసినా పసివాని పేరుపై ఏకాభిప్రాయం కుదరలేదు.

మా అల్లుడు మేనకాగాంధీ గారి 'పదివేల హిందూ పేర్లు' పుస్తకం తెచ్చాడు. నావంతుగా నేను 'విష్ణుసహస్ర నామాలు', 'వినాయక సహస్రనామాలు' పుస్తకాలు ఇచ్చాను. కుటుంబ సభ్యులందరి సమావేశంలో చర్చల తర్వాత అయిదు పేర్లు తేలాయి. వాటి నుండి ఓ పేరు ఖాయం చేయమని స్నేహ, కిరీటి, నన్ను, మా వియ్యంకుడ్ని కోరారు. మా శిఖరాగ్ర సమావేశంలో ఓ పేరు ఎంపిక చేశాం. అది గోప్యంగా ఉంచాము. బారసాలనాడే ప్రకటించాలని నిర్ణయించాం.

"ఆ పేరు ఏదై వుంటుందా అని పిల్లల తర్జనభర్జన. వాళ్ళలో వాళ్ళు చర్చించడం, వాదులాడడం, నానుండి రాబట్టే ప్రయత్నాలు, ఇవన్నీ చూసి చాలా అపూర్వమైన అనుభూతికి లోనయ్యాను. కుటుంబ సంబంధాలు, అనుబంధాలు, సంబరాలు ఇంత తీపిగా ఉంటాయని మొట్టమొదటిసారి తెలిసింది. అనవసరంగా ఆఫీసు పనులు నెత్తిమీద వేసుకుని జీవితంలో ఏమి కోల్పోయానో తెలియవచ్చింది.

దాదాపు ఇరవై సంవత్సరాల తర్వాత మా ఇంట్లో బారసాల జరగబోతోంది. (మా చిన్నమ్మాయికిప్పుడు ఇరవై ఏళ్ళు) అందుకే కాస్త భారీగానే చేయాలనుకున్నాం. 'నామకరణ మహోత్సవ ఆహ్వాన పత్రిక' ప్రింట్ చేయించాం. మా ఇంటి దగ్గర ఫంక్షన్ హాల్ బుక్ చేసి, క్యాటరర్‌ను మాట్లాడాం. దాదాపు అయిదారు వందల ఆహూతులకు భోజనాలు చేయమన్నాం. మా అత్తవారిని, చెల్లెళ్ళను, మరదళ్ళను ఊరినుండి బారసాలకు రెండు మూడు రోజుల ముందే రమ్మని ఫోను చేశాం. పత్రికలు కూడా పంపాం. వారికి వసతి ఏర్పాట్లు చేశాం. బంధువులకు ఇవ్వడానికి చీరె, సారెలు కొన్నాం.

బారసాల తేదీ దగ్గరకొస్తున్నకొద్దీ బంధువులు ఒక్కొక్కరే దిగుతున్నారు. బాబుని చూసి అందరూ సంబరపడ్డారు.

'నా లడ్డు, నా అరిసె, ఎంత ముద్దొస్తున్నవో. కన్నా! నువ్వు పెద్దయిన తర్వాత మంచి చదువులు చదవాలి. మీ తాతల్లాగా పెద్ద ఆఫీసరువో, నాన్నలాగా మంచి ఇంజనీరువో కావాలి" మా అత్తమ్మ దీవెన.

"లేదు బాబూ! మన ఇళ్ళల్లో డాక్టరెవరూ లేరు. నీవు పెద్ద డాక్టరువి కావాలి. అమెరికాలో సర్జరీ చదివి మంచి సర్జన్‌వి కావాలి" మా వియ్యంకుని తల్లి కోరిక.

"ఆ బుజ్జినాన్నా! నువు పెద్ద డాక్టరువై మమ్మల్ని మరిచిపోయేవు. మా అన్న పెద్ద ఆఫీసరై మమ్మల్ని విమానంలో తిప్పుతాడనుకున్నాం. ఆఫీసరైతే అయ్యాడు మా అన్న, కాని మా కోరిక కోరికగానే ఉండిపోయింది. నువ్వయినా మా కోరిక తీరుస్తావా?" మా పెద్దచెల్లి పలకరింపు.

"మీ అమ్మ పెళ్ళిలో మాకు వేయి రూపాయల బెంగుళూరు చీర పెట్టారు. బనారస్ సిల్క్ చీర కట్టాలనే మా ఆశ తీరనే లేదు. నువ్వు తప్పకుండా తీరుస్తావు కదూ?" మా చిన్నమరదలి అడ్వాన్స్ బుకింగ్.

"మీ నాన్నలాగా ఆదర్శాలకు పోయి వరకట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకునేవు. విదేశాల్లో పెద్ద చదువులు చదివితే కోటి రూపాయల కట్నంతో పిల్లనిస్తామని వస్తారు. మా మునిమనవడికి కోటి రూపాయల కట్నం, అరకోటి రూపాయల లాంఛనాలతో పెళ్ళి చేశారని, మా ఊర్లో గొప్పగా చెప్పుకుంటాం" మా నాన్న బడాయి.

"మీ పిచ్చిగానీ. ఈ బుడతడి పెళ్ళయేదాకా మనం బతుకుతామా?" అని మా నాన్నతో అని "ముసలివాళ్ళు ఇక్కడికెందుకొచ్చారు? అని కసురుకోకుండా, జేజి తాతయ్యా, జేజి బామ్మా అని కడుపు నిండా పిలిస్తే చాలయ్యా" మా అమ్మ అంది.

మనవడ్ని చేతిలోకి తీసుకుని మా ఆవిడ "మా మనవడు మమతల మల్లెపూవు. ఇప్పటి పిల్లల్లా పెద్దవాళ్ళను ఛీదరించుకోడు" అంటూ హత్తుకుంది.

ఆరోజు రానే వచ్చింది. ఇంటి ద్వారాలను మామిడి తోరణాలతో, పూలతో అలంకరించాం. ఇంట్లో పూజ చేసి సాయంత్రం హాలుకి బయలుదేరాం. 'ఇప్పుడైనా పేరు చెప్పండి' అని పిల్లల గోల. ఇన్ని రోజులు ఆగారు, ఇంకొన్ని గంటలు ఆగలేరూ?' అని వారిని ఊరుకోబెట్టాం. మా మనవడి ఫోటో, పేరు, పుట్టిన తేదీ, నామకరణం తేదీతో సహా ఓ ఫ్లెక్సీ షీటు మీద కంప్యూటర్‌లో డిజైన్ చేసి ప్రింట్ చేయించాం. దాన్ని చుట్టచుట్టి, లాగగానే కిందికి తెరుచుకునేలా దారం కట్టాం. స్టేజికి ఒకపక్క వేలాడదీశాం.

మా కూతురు, అల్లునితో పురోహితుడు పూజ చేయించాడు. ఇక పేరు పెట్టడమే తరువాయి. మనవణ్ణి పడుకోబెట్టడానికి పూలతో అలంకరించిన తొట్టి (ఊయల) ఏర్పాటు చేశాం. మావైపునుండి ముగ్గురు, మా వియ్యాలవారి తరపు నుండి ముగ్గురు ముత్తయిదువలు, తొట్టికి చెరోవైపు నుంచున్నారు. పాటలు పాడుతూ ఒకరు ఒకవైపు

నుండి పసివాడ్ని తొట్టిలో వేస్తే ఇంకోవైపు వారు అందుకోవడం, వారు ఆ వైపు నుండి వేస్తే వీరు అందుకోవడం, ఇలా అయిదుసార్లు జరిగింది. ఆ హడావుడికి పాపం పిల్లవాడు బెంబేలెత్తిపోయాడు. పాలు పట్టి ఊరుకోబెట్టారు. ఇక మేనత్త పేరుపెట్టాలి కనుక ఆమెను పేరుకి సంబంధించిన షీటుకి కట్టిన దారం లాగమన్నాం. దారం లాగగానే పేరు బహిర్గతమైంది. పేరు పెట్టడానికి ఈ కొత్తపద్ధతి చూసి వచ్చిన అతిథులు అబ్బురపడ్డారు. ఆధునిక పరిజ్ఞానాన్ని ఇంటి సంబరాలకి వాడుకున్న విధానాన్ని చూసి ముచ్చటపడ్డారు. కొందరు పాత తరపువారు మాత్రం ఊయలలోకి వంగి సంప్రదాయం ప్రకారం పేరు పెట్టాలని పట్టుపట్టారు. ఇక మా అల్లుని అక్కగారికి తప్పలేదు. పేరు పెట్టడానికి ఊయలలోకి వంగిందో లేదో, పక్కనున్న అమ్మలక్కలు వీపుమీద గ్రుద్దుడు మొదలుపెట్టారు. వంతులవారీగా అందరు ఇంటి బంధువులు ఊయలలోకి వంగి పసివాడ్ని పేరుతో పిలిచారు. నాకూ, విద్యకూ వీపుపై గుద్దులు తప్పలేదు. తొట్టికి కట్టిన ఆటబొమ్మలు చూస్తూ బుజ్జిగాడు కేరింతలు కొడుతున్నాడు. అదంతా ఓ సంబరం. మధురమైన జ్ఞాపకాల పేటిక.

'మనవడి బారసాల ఇంత ఘనంగా చేశారు. ఇక చిన్నమ్మాయి పెళ్ళి ఎంత భవ్యంగా చేస్తారో' అని వచ్చిన చుట్టాలు మాట్లాడుకున్నారు.

ఇంతకీ మనవడి పేరేం పెట్టామంటారా? అది మీకు సస్పెన్స్. మీరు బారసాల కెందుకు రాలేదు? వస్తే మీకూ ఆ అధునాతన, అపూర్వమైన పేరు తెలిసేది. మీకంత ఆసక్తి వుంటే మా అమ్మాయింటికి వెళ్ళాల్సిందే. ఏం ? అమ్మాయి మీ ఇంట్లోనే కదా ఉంది అంటారా? ఎన్నాళ్ళు మా ఇంట్లో వుంటుంది? అమ్మాయిలు పెళ్ళి తర్వాత పుట్టింట్లో చుట్టాలేకదా.

నిజానికి బారసాల అయింతర్వాత వెంటనే మా అమ్మాయిని మనవణ్ణి వాళ్ళింటికి తీసుకుపోతామన్నారు. మేము ససేమిరా అన్నాము. మావైపు ప్రసూతి తర్వాత మూణ్నెల్లలో అత్తవారింటికి పంపే పద్ధతి ఉందని చెప్పాం. కొంత బెట్టుచేసినా, మా అమ్మాయి కూడా పట్టుపట్టేసరికి మా ఇంట్లో మరి రెండు నెలలు వుంచడానికి ఒప్పుకున్నారు.

ఓరోజు ఆఫీసులో మీటింగ్‌లో వున్నాను. సెల్ ఫోన్ మోగింది. చూస్తే ఇంటినుంచి. కట్ చేశాను. రెండు నిమిషాల్లో మళ్ళీ ఫోన్. కట్ చేశాను. అలా పది నిమిషాల్లో మరో ఆరుసార్లు ఫోన్. ఏదో అర్జంట్ విషయమై వుంటుందనుకుని మా కొలీగ్స్‌కి చెప్పి కాన్ఫరెన్స్ హాల్ నుంచి బయటకు వచ్చాను. ల్యాండ్‌లైన్ నుండి ఇంటికి ఫోన్ చేశాను.

"మనవడి ఒళ్ళు వేడి చేసిందండీ. దగ్గుతున్నాడు కూడా. పాలు కూడా సరిగా తాగడంలేదు. గుక్క తీసుకోకుండా ఒకే ఏడుపు. నాకేదో భయంగా ఉందండీ, మీరు వెంటనే రండి" అందోళన, తత్తరపాటు, మా ఆవిడ మాటల్లో.

"ఆ మాత్రానికే ఇంత హడావిడి పడితే ఎలా. నిన్న బి.సి.జి. ఇంజక్షన్ ఇప్పించాం కదా, దానికి కాస్త జ్వరం వస్తుంది. నువ్వేం కంగారుపడకు".

"మీరలా అంటారు. నా ప్రాణం పోతోందిక్కడ. మీరు వచ్చేయండి."

"వచ్చి నేను మాత్రం ఏం చేయగలను? మన డాక్టరు గారికి ఫోన్ చెయ్. వద్దులే నేనే చేస్తాను. ఇంటికి పంపిస్తాను. నువ్వేం కంగారుపడకు."

"అయినా మీరు కూడా రండి. నాకేదో భయంగా ఉందండీ."

"సరే అరగంటలో అక్కడ ఉంటాను. నువ్వు ఫోన్ పెట్టెయ్, డాక్టరు గారికి ఫోన్ చేయాలి."

నేను ఇంటికి వెళ్ళేసరికి మనవడు కేరింతలు కొడుతున్నాడు. మా ఆవిడ ముఖం ప్రశాంతంగా వుంది.

"మీరన్నట్టు బి.సి.జీ. వల్లనే ఒళ్ళు వేడిచేసిందటండీ."

'నేను చెప్పలేదూ' అన్నట్టు మా ఆవిడ వైపు చూసి, మనవడ్ని ఎత్తుకుని ముద్దులు కురిపించాను.

కాలం పరుగెత్తింది. చూస్తుండగానే రెండు నెలలు పూర్తయి, మూడోనెల వచ్చింది బుజ్జిగాడికి. మంచి ముహూర్తం చూసి ఫలానా రోజు మేము మా కోడలిని ఇంటికి తీసుకెళ్తామని కబురు చేశారు వియ్యాలవారు. మా ఆవిడ హడావిడి మొదలైంది. మనసులో గుబులుగా ఉన్నా, బింకంగా వీడ్కోలు సన్నాహాలు మొదలుపెట్టింది. అమ్మాయివి, మనవడివి బట్టలు, ఇతర సరంజామా సర్దింది. ఆరోజురానే వచ్చింది. మా వియ్యంకుడు, వారి కుమార్తె, ఇంకో ఇద్దరు ముత్తయిదువులు క్వాలిస్ జీప్ తీసుకు వచ్చారు. మా ఆవిడ మనసు మనసులో లేదు. ఇక్కడ వున్న చనువు, స్వాతంత్ర్యం అత్తారింట్లో వుండదు కదా! అనే బెంగతో, మా అమ్మాయి కూడా బేలగా వుంది. ఇద్దర్నీ నేను సాంత్వనపర్చాను. నా మనసూ మనవడిమీద నుండి మరలడం లేదు, అయినా తట్టుకున్నాను.

సజల నయనాలతో మా అమ్మాయికి, మనవడికి వీడ్కోలు పలికాం. రెండు రోజులుండి రమ్మని తోడుగా మా చిన్నమ్మాయిని పంపాం.

ఆరోజంతా విద్య, మనవడిని తలచుకుంటూ కళ్ళు వత్తుకోసాగింది. తనలో తను మధనపడింది.

'పిచ్చి విద్యా, ముగ్గుర్ని కనిపెంచిన నీవే ఇలా బెంబేలు పడితే ఎలా? అమ్మాయి, మనవడి మీద ఎంత ప్రేముంటే మాత్రం, ఎప్పటికీ ఇక్కడ ఉండమనలేము కదా? అయినా వాళ్ళున్నది ఈ ఊళ్ళోనే. రోజూ రెండుసార్లు ఫోనులో పలకరించు. మరీ అంతగా చూడాలనిపిస్తే, ప్రతి శనివారం వాళ్ళింటికి వెళ్ళవచ్చు."

"ఇవన్నీ నాకూ తెలుసండీ, కాని మనసు ఆగడం లేదు."

"నాకు మాత్రం స్నేహ, బుజ్జిగాడు జ్ఞాపకం రావడంలేదా? అయినా ఓర్చుకుంటున్నాను. నీవూ అదే అలవాటు చేసుకో" అని శ్రీమతిని ఓదార్చాను.

రెండు రోజులు గడిచాయో లేదో...

"బుజ్జిగాడు కలలోకొస్తున్నాడండీ. మనం వెంటనే అమ్మాయింటికి వెళదామండీ" నేను ఆఫీసు నుండి రాగానే విద్య విన్నపం.

"లేడికి లేచిందే పరుగన్నట్టు, ఇప్పటికిప్పుడు వెళదామంటే ఎలా కుదురుతుంది? ఎల్లుండి శనివారం ఆఫీసుకు సెలవు. పొద్దున్నే బయలుదేరి వెళదాం సరేనా? ఇప్పటికి అమ్మాయితో ఫోనులో మాట్లాడి సరిపెట్టుకో."

శనివారం ఉదయం తొమ్మిది గంటలకే మా అమ్మాయింటికి చేరుకున్నాం. మా వియ్యపురాలి పలకరింపుకు జవాబు కూడా ఇవ్వకుండా లోపలి గదిలోకి దొచ్చుకుపోయింది విద్య. పడుకున్న పసివాడ్ని అక్కున చేర్చుకుంది. కళ్ళు చెమర్చాయి. ఆ దృశ్యం చూసిన నా కళ్ళూ చెమర్చాయి.

ఒక్కసారిగా నిద్రాభంగం అయ్యేసరికి పిల్లవాడు ఏడుపందుకున్నాడు.

"స్నేహా! మీ అమ్మగారికి మనవణ్ణి ఎంత చూసినా తనివితీరదు కాని, బుజ్జిగాడికి పాలుపట్టు" అని నేననగానే ఈ లోకంలోకి వచ్చింది విద్య.

"ఏమో అనుకున్నానుగానీ, నానమ్మ బాగానే చూస్తున్నట్టుంది. థాంక్యూ వదినమ్మా!"

"అదేంటొదినా? మాకు మాత్రం మనవడు కాదూ? పిల్లాడు ఒళ్ళు చేశాడో లేదో కాని, నువ్వు మాత్రం చిక్కిపోయావొదినా" వియ్యపురాలి పలకరింపు. టీ, కాఫీలయ్యాక ఇక బుజ్జిగాడితో ఆడుకోవడం నా వంతయింది.

"ఓరి బుజ్జిగా! నువ్వొచ్చి పట్టుమని పదిరోజులు కాలేదు. నాకు పోటీగా తయారయ్యేవు. ఇప్పుడు మీ అమ్మమ్మ నన్నేమాత్రం పట్టించుకోవడం లేదు. నువ్వు

మా ఇంట్లో వున్నప్పుడే అనుకుంటే, నువ్వు మీ ఇంటికి వచ్చింతర్వాత కూడా నీ ధ్యాసే. ఏ పని చేసినా పరధ్యానంగానే."

"అరెరే! ఇదేమిటి? నా లాల్చీ తడిసింది? ఓరి భడవా! నా మీద సెంటు చల్లావా? తీర్థంతోనే సరిపుచ్చుతావా, లేక ప్రసాదం కూడా పెడతావా. అమ్మమ్మమ్మ. అంతపని చేసేవు. నువ్వు నా గారాల తాతవి కదూ! ఏమిటీ? మీ అమ్మమ్మపై చాడీలు చెప్తున్నందుకా ఈ వడ్డింపు? అమ్మమ్మంటే అంత ప్రేమా నీకు? పైకి అనను కానీ నాకు అంతేలే."

బుజ్జిగాడు నవ్వాడు. నా 'కడుపు' నిండింది.

అక్కడే వున్న విద్య కూడా కిసుక్కున నవ్వింది.

'ఎందుకు నవ్వుతున్నావ్' అన్నట్టు చూశాను విద్యకేసి.

'మీరేమైనా అనండి. మన పెళ్ళయిన ఇన్ని సంవత్సరాల్లో నేను చేయలేని పని, ఈ బుజ్జిగాడు చేశాడు. మిమ్మల్ని కాస్త ఇంటి విషయాలను పట్టించుకునేలా చేశాడు. మీ బ్లడ్ ప్రెషర్ నార్మల్ కొచ్చింది. మొహంలో అలసట పోయి ఓ కొత్త కాంతి వచ్చింది".

విద్య మొహంలో తృప్తి. నాకూ సంతోషంగా వుంది.

"నేను తాతనయ్యానోచ్" అని బిగ్గరగా అరవాలని ఉంది.